క్లుప్తంగా

దోమల నిర్మూలనతో మలేరియా నివారణ



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

యాడికి: దోమల నిర్మూలనతో మలేరియాను నివారించవచ్చని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు అన్నారు. మలేరియా మాసోత్సవం సందర్భంగా బుధవారం కోనుప్పలపాడు ఉన్నత పాఠశాల నుంచి గ్రామ పురవీధుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి వ్యాధులు కలుగజేస్తాయన్నారు. దోములు పెరగకుండా ప్రతి ఒక్కరూ తమ చుట్టు పక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. రాత్రిపూట ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని సూచించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఏఎస్‌ఎం రాజామణి, హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఆశా కార్యకర్త రాణి పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రైతన్నలు పంటకు వచ్చే తెగుళ్ల నివారణపై ప్రత్యేక దృష్టిని సారించాలని ఏఓ లీనా వసుంధర సూచించారు. బుధవారం ఆమె తన సిబ్బందితో కలిసి అమీన్‌పల్లి, మొలకలపెంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ సరైన సస్యరక్షణ చర్యలు పాటించకపోతే తెగుళ్ల కారణంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కంది, వేరుశెనగ పంటల్లో సస్యరక్షణ విధానాలను రైతులకు వివరించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించిన ఎంఈఓ నాగరాజు, కంపెనీ ప్రతినిధులు

తాడిపత్రి రూరల్: మండలంలోని అర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో బుధవారం 12 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ మొత్తాన్ని ఎంఈఓ నాగరాజు అందజేశారు. అర్జాస్ స్టీల్ ప్లాంట్ (సండూరు) సీఎస్‌ఆర్(కార్పొరేట్ సామాజిక బాధ్యత)కింద పాలిటెక్నికల్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ మంజూరు చేసినట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి



భక్తులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్

గుంతకల్లు రూరల్: భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని దేవదాయ శాఖ రాయలసీమ జోన్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ ఆలయ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పర్యటించి ఆలయ నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాలను పరిశీలించారు. ఆలయంలో భక్తులకు కలిప్తున్న సౌకర్యాలు భాగానే ఉన్నప్పటికీ మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఆలయ ఈఓ కే.వాణి, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చండి



దీక్షలో కూర్చున్న కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్, సహాయ కార్యదర్శి సురేంద్ర కోరారు. జేఏసీ పిలుపుమేరకు కార్మికులు బుధవారం మున్సిపల్ ఆఫీసు ఎదుట రిలేదీక్షలు చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 17 రోజులుగా నిరసనలు, ధర్నాలు, సమ్మె చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మస్తాన్, లక్ష్మీనారాయణ, సుంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా కార్మికుల దీక్షకు టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అరటి.. లాభాల్లో మేటి!

- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- పుట్లూరు మండలంలో అధికంగా 5450 ఎకరాల్లో సాగు



పుట్లూరు వద్ద సాగైన అరటి తోట

తాడిపత్రి రూరల్: తాడిపత్రి ప్రాంతంలోని పలు మండలాల్లో ఈ ఏడాది అరటి సాగుపై రైతులు అసక్తి చూపుతున్నారు. నీటి పారుదల ఉంటే అరటికి మించిన దిగుబడి, లాభాలు మరే పంటకు ఉండవని రైతులు అభిప్రాయపడుతున్నారు. పంట సాగుకు పెట్టుబడి ఎక్కువైనా సరైన సమయంలో ధరలు ఉంటే రెండింతలు లాభాలు వస్తాయన్న అలోచనలతో రైతులు అటువైపు మొగ్గు చూపుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలోని ఆయా మండలాల్లో దాదాపు పదివేల హెక్టార్లల్లో అరటి సాగులో ఉంది. తాడిపత్రి మండలంలో 136 ఎకరాలు, యల్లనూరు 3572 ఎకరాలు, పెద్దపప్పూరు 2860, పుట్లూరు 5450 ఎకరాల్లో సాగు చేశారు.

మూడు దఫాల్లో దిగుబడి..

అరటి సాగు చేసిన రైతులు మూడు దఫాల్లో దిగుబడి పొందుతారు. మొదటి కోతకు ఎక్కువ ధర రెండో కోతకు తక్కువ, మూడో కోతకు అతి తక్కువ ధర పలుకుతుంది. అంచనాల మేరకు పంట దిగుబడి వస్తే ఎకరాకు మొదటి కోత 20 నుంచి 22 టన్నులు, రెండో కోత 16 నుంచి 17 టన్నులు, మూడో కోతకు 10 నుంచి 12 టన్నుల వరకు వస్తుంది. తాడిపత్రి ప్రాంతం నుంచి ఎక్కువగా అరటిని వ్యాపారులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, డిల్లీ, కోల్‌కత్తా, శ్రీనగర్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఎరువులకు పెరిగిన డిమాండ్

ఈ ఏడాది అరటి సాగుపై రైతులు అసక్తి చూపుతుండటంతో అదే స్థాయిలో ఎరువులకు డిమాండ్ ఏర్పడింది. తాడిపత్రిలోని డీసీఎంఎస్‌తో పాటు ప్రైవేట్ ఫర్టిలైజర్ల నుంచి రైతులు పెద్ద ఎత్తున ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేట్ ఫర్టిలైజర్లలో ఎరువుల ధరల కంటే డీసీఎంఎస్‌లో తక్కువగా ఉండటంతో రైతులు ఇక్కడికి వచ్చి ఎరువులను కొంటున్నారు. డీఏపీ, 10-26, 20-20-20,14-35 రకం ఎరువులకు ఎక్కువగా డిమాండ్ ఉంటోంది.

అరటి సాగుతో కూలీలకు ఉపాధి



డీసీఎంఎస్ గోడౌన్ నుంచి ఆటోల్లో ఎరువులను తీసుకెళుతున్న రైతులు

తాడిపత్రి ప్రాంతంలో పండిస్తున్న అరటి సాగుతో పలువురు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎక్కువ మంది మహిళా కూలీలు ఉపాధి దొరుకుతోంది. అరటిపిలకలు నాటడంతోపాటు ఇతర పనులకు కూలీలు ఎక్కువగా అవసరమవుతారు. గతంలో ఇతర ప్రాంతాలకు ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు స్వగ్రామాల్లోనే కూలీ పనులు దొరకడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అరటి కోసం పైపులైన్



అరటిసాగు కోసం నాతోపాటు మరికొందరు రైతులు చిత్రావతి నది ఒడ్డులో బోర్లు వేసి పైపులైన్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నాం. గతంలో చీనీచెట్లను సాగు చేసి తెగుళ్ల కారణంగా కొట్టివేశాను. అరటి వల్ల లాభాలు ఉన్నాయన్న ఇతర రైతుల అలోచనతో నేను సాగు చేశాను. – అదినారాయణ,రైతు, గరుగుచింతలపల్లి

ఎరువులకు డిమాండ్



తాడిపత్రి ప్రాంతంలో రైతులు అరటి సాగుపై ఎక్కువ మక్కువ చూపడంతో ఎరువులకు డిమాండ్ ఏర్పడింది. అందుకు అనుగుణంగా ఎరువులను తెప్పిస్తున్నాం. రైతులకు ఎరువుల కొరత రాకుండా ముందస్తు జగ్రత్తలు తీసుకుంటున్నాం. గతేడాది కంటే ఈ ఏడాది రైతులు ఎక్కువగా ఎరువులను తీసుకుంటున్నారు. – ప్రసాద్, డీసీఎంఎస్ మేనేజర్, తాడిపత్రి

‘సూపర్ సిక్స్’ అమలు చేసేదాకా పోరాడదాం



మహిళా విభాగం అధ్యక్షురాలు చెన్నమ్మను సన్మానిస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన సూపర్‌సిక్స్‌తో పాటు ఇతర హామీలన్నీ నెరవేర్చే వరకు పోరాటాం కొనసాగిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ అనుబంధ సంఘాల్లో పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలను ఆమె ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జగనన్నతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ సాధ్యమని ఆమె చెప్పారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి సర్కారు మెడలు వంచైనా హామీల అమలుకు కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, ఉపాధ్యక్షుడు తిమ్మప్ప, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు కౌన్సిలర్ చెన్నమ్మ, యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, పట్టణ అధ్యక్షుడు మనోజ్, ఉపాధ్యక్షులు చుక్కాసీనా, ఫయాజ్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కార్యదర్శులు మధు, అనిల్, హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు అమోఘం



అధికారులను సన్మానిస్తున్న ఆర్‌డీఓ శ్రీనివాస్

గుంతకల్లు: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఉద్యోగుల అమోఘమని ఆర్‌డీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు ఉదయ్‌భాస్కర్, శాంతికుమారి, సీనియర్ అసిస్టెంట్ షేక్షావలి బదిలీ అయ్యారు. బుధవారం ఆర్‌డీఓ శ్రీనివాస్‌తోపాటు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, తహసీల్దార్ రమాదేవి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ హరిప్రసాద్ తదితరులు వారిని పూలమాలలు, శాలవాలతో ఘనంగా సత్కరించారు. ఏఓ వై.భూషణంతోపాటు గుత్తి, పామిడి మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

గుత్తి రూరల్: తురకపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయినులను గ్రామస్తులు బుధవారం సన్మానించారు. పాఠశాలలో హెచ్‌ఎం రఫీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎం.సారా కల్పలత, ఎస్.షర్మిలాపర్వీన్‌ను ఘనంగా సత్కరించారు. వక్తలు వారి సేవలను కొనియడారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా బస్టాండ్



పామిడి ఆర్టీసీ బస్టాండ్

పామిడి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రయాణికుల సౌకర్యార్థం 1991లో బస్టాండ్‌ను నిర్మించారు. అప్పట్లో బస్టాండ్ పట్టణానికి వెలుపల ఉండటంతో ఉపయోగానికి నోచుకోలేదు. ప్రస్తుతం బస్టాండు చుట్టూ పలు కాలనీలు ఏర్పాటు కావడంతో ప్రతి డిపో బస్సు ఆర్టీసీ బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆర్డీనరీ బస్సులు మాత్రమే బస్టాండ్‌లోకి వచ్చి వెళ్తున్నాయి. బస్టాండు నిర్వహణ సరిగా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పులి జూదం, మట్కా, మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా ఆర్టీసీ జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి బస్టాండ్‌కు ప్రహరీ నిర్మించడంతోపాటు మరమ్మతులు చేయించి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రజలు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని కొర్రపాడు పీహెచ్‌సీ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని పేర్కొన్నారు. గురువారం అమ్మవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో డయేరియా పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ డయోరియే లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. సీడీపీఓ లలితమ్మ, కౌసల్య, శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దిలీప్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ముకుందాపురంలో డయేరియా పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సీజనల్ వ్యాధులు, డయోరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఎంపీహెచ్‌ఈఓ నాగేశ్వరయ్య, ఏఎన్‌ఎమ్ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన



ఎంపీడీఓ సాల్మాన్‌కు విపతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

బుక్కరాయసముద్రం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల్లో బదిలీలకు ముందు పదోన్నతులు కల్పించాలన్నారు. స్పష్టమైన సర్వీసు రూల్స్ వెంటనే ప్రకటించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రంను ఎంపీడీఓ సాల్మాన్‌కు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు నరసింహులు, స్వరూప్, శ్రీనివాసులు, అభిషేక్ రమణ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: వేతన బిల్లు సకాలంలో సమర్పించి వేతనాలు అందేలా చూడాలని యాడికి మేజర్ పంచాయతీలోని ఐదు సచివాలయాల ఉద్యోగులు ఎంపీడీఓ వీర్రాజు, ఏఓ నాగేశ్వరరెడ్డి, ఈఓపీఆర్డీ శశికళను కోరారు. బుధవారం వారు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యను వివరించారు. త్వరలో తమకు బదిలీలు ఉన్నాయని, వేరే మండలాలకు వెళ్లితే జూన్‌కు సంబంధించిన వేతనం అందేలా చూడాలని కోరారు. డీపీఓకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: కూరగాయల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని డీఏఓ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. బుధవారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అధ్యక్షతన కూరగాయల సాగులో నారు పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఏఓ మాట్లాడుతూ నారు కొనుగోలు సమయంలో తప్పని సరిగా రసీదులు తీసుకోవాలన్నారు. నాణ్యమైన మొక్కల ఎంపిక చేసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. నారు పెంపకంలో యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ త్రికళ మాధవి, ఉద్యాన వన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త ఉదయ్‌భాస్కర్, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, పశు పోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, వ్యవసాయ విస్తరణా శాస్త్రవేత్త డాక్టర్ చందన రైతులు పాల్గొన్నారు.

‘మెరుగైన సేవలందిస్తాం’



డాక్టర్ సునీత

పెద్దవడుగూరు : పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని డాక్టర్ సునీత, పుష్పలత పేర్కొన్నారు. బుధవారం వారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్లు శ్రీనివాసబాబు, అమర్‌నాథ్ బదిలీ అయ్యారు. వారి స్థానంలో అనంతపురం జీజీహెచ్‌లో పని చేస్తున్న డాక్టర్ సునీత, పుష్పలత ఇక్కడికి వచ్చారు. అందుబాటులో ఉండి రోగులకు సేవలందిస్తామని నూతన డాక్టర్లు పేర్కొన్నారు.

సక్రమంగా పని చేయండి

పెద్దవడుగూరు: ఉపాధి హామీ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఏపీఓ విజయభారతి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలని ఆమె సిబ్బందికి సూచించారు. పనులు నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించినా ఉపేక్షించేది లేదన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోండి



ఎంఈఓ రవినాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గుత్తి: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎంఈఓ రవి నాయక్‌ను కోరారు. ఈమేరకు బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, పట్టణాధ్యక్షుడు బాలాజీ, నాయకులు నవీన్, నరేష్ ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గుంతకల్లు: కసాపురం గ్రామంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జ్యేష్ట అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం అనంతరం పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తలారి శకుంతలమ్మ, పరుశురాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు జరుగునని కమిషనర్ నయీమ్ అహ్మద్ బుధవారం తెలిపారు. కౌన్సిల్, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొనాలని కోరారు.

బస్టాండ్‌లో ఫ్యాన్లు, కుర్చీల ఏర్పాటు

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల సౌకర్యార్థం కొత్తగా 5(3 సీటర్స్) కుర్చీలు, 8 ఫ్యాన్లు, సమయపాలన బోర్డులు ఏర్పాటు చేసినట్లు డీఎం కెవి. గంగాధర్ బుధవారం తెలిపారు. ప్రాంగాణాన్ని శుభ్రం చేసేందుకు ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులను నియమించామన్నారు. విద్యార్థులకు బస్సు పాస్‌లను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

గుంతకల్లు: అగ్రిగోల్డ్ బాధితులుకు ప్రభుత్వం న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, అనంతపురం జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప కోరారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేయకుండా స్పెషల్ కోర్టు, సీఐడీ ద్వారా సిట్ ఏర్పాటు చేయాలన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తుల వెరిఫికేషన్ ప్రక్రియని వేగవంతంగా పూర్తిచేసి వాటిని వేలం ద్వారా అమ్మి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



ఖాజాహుస్సేన్ (ఫైల్)

యాడికి: కూర్మాజిపేటలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఖాజా హుసేన్(66) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, నాయకులు ఉపేంద్ర గౌడ్, తలారీ నాగేష్, ఉప సర్పంచు ప్రవీణ్‌యాదవ్, సుబ్బయ్య, అంజి తదితరులు కూర్మాజిపేటకు చేరుకుని ఖాజాహుసేన్ మృతదేహంపై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



శేఖర్‌బాబు

శింగనమల: శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు శేఖర్‌బాబు అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం అనంతపురంలో తన స్వగృహంలో మృతి చెందారు. బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, ఉపాధ్యాయులు శేఖర్ బాబు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు శేఖర్ బాబు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ మృతి



ఆనంద్(ఫైల్)

గుంతకల్లుటౌన్: ఏపీ నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నేత పులిచెర్ల ఆనంద్(62) మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆనంద్ బుధవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి నాయీబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, తదితర నాయకులు సంతాపం తెలియజేశారు.

నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు మహిళా సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ బుధవారం తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిపై డివిజన్ పరిధిలోని మహిళ సర్పంచ్‌లకు శిక్షణ ఉంటుందన్నారు. మహిళ సర్పంచ్‌లు తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

ఈఓఆర్‌డీగా శ్రీదేవి

పెద్దవడుగూరు : మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా శ్రీదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న నరసింహారెడ్డి గుత్తికి బదిలీ అయ్యారు. పెనుకొండ ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న శ్రీదేవి ఇక్కడికి వచ్చారు. ప్రజాప్రతినిధులు, కార్యదర్శుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రశాంతినగర్ దోబీఘాట్ వద్ద బుధవారం మధ్యాహ్నం పేకాట ఆడుతున్న 8 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. వారి నుంచి రూ.74,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆటోబోల్తా : నలుగురికి గాయాలు

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి గ్రామం వద్ద బుధవారం ఉదయం ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురానికి చెందిన తల్లి, కొడుకు తస్లీమ్, తస్వీర్‌తో పాటు బాషా, బీబీ ఆటోలో ఎల్లార్తికి బయలుదేరారు. ఎద్దులపల్లి వద్ద కుక్క అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో ఆటోలో ఉన్న నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

యాచకుడికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని బాలాజీ లాడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాచకుడికి గాయాలయ్యాయి. రోడ్డు దాటుతున్న అతడిని బొలెరో వాహనం ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాచకుడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గుత్తి: పట్టణంలోని కమాటం వీధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా బుధవారం చర్యలు తీసుకున్నారు. రెండు విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో డీఈ హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా, మున్సిపల్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పామిడి: తంబళ్ళపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఖాదర్‌బాషా(50) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, తంబళ్ళపల్లి వెంకట్రామిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు ఖాదర్‌బాషా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.